

# యువతా ఎటువైపు నీ పయనం

కిక్కిరిసిపోయిన జనంతో ఒక ప్రక్కకి ఒరిగిపోయి నిండుగర్భిణిలా భారంగా కదులుతోంది సెక్రెటేరియట్ పోయే సిటీబస్.

అంత జనంలో కూడా రాడ్ పట్టుకున్నట్లు నటిస్తూ అమ్మాయిల చేతిమీద చేయి వేసేవాడు ఒకడైతే, కనిపించని అందాలని చూద్దామని తొంగి తొంగి చూసేవాడు మరొకడు.

అబ్బాయిలు విసిరే కొంటె కామెంట్స్‌కి చిన్నగా చిరునవ్వు చిందించే అమ్మాయిలు కొందరైతే, చిటపటలాడే అమ్మాయిలు మరికొందరు.

వీళ్ళిద్దరి గొడవకి ఆనందిస్తూ చూసే అంకుల్స్, ఆంటీస్ కొందరైతే, పిదపకాలం, పిదప బుద్ధులు అని గొణుక్కునే బామ్మలు, తాతయ్యలు మరికొందరు.

ఎవరి హడావుడి వారిది. ఎవరి గొడవ వారిది.

కండక్టర్ వేసిన విజిల్‌కి రిప్లైగా డ్రైవర్ బస్‌ని స్టార్ట్ చేశాడు.

ఆ కదిలే బస్ రాడ్ పట్టుకొని ఆయాసపడుతూ బస్‌లోకి వచ్చింది కీర్వాణి. బస్‌లోకి వచ్చి ఆయాసపడుతున్న కీర్వాణిపైకి అందరి చూపులు తిరిగాయి. ఒక్కో చూపుది ఒక్కో భాష.

"అంత హడావుడిపడే బదులు కొంచెం ముందు బయలుదేరవచ్చుగా" అనే చూపు ఒకటైతే,

"పాపం ఈ బస్ మిస్ అయితే ఎంత కష్టపడేది కాలని మండి బయటికి నడుచుకొని వెళ్ళడానికి" అని జాలిగా చూసే చూపులు కొన్ని.

ఆయాసంతో ఎగిరిపడే అందాలని చూడాలనే యావ కొందరిదైతే, ఆమె పరిస్థితి అర్థం చేసుకున్నది చాలా తక్కువమంది మాత్రమే.

"వెనక్కి వెళ్ళండమ్మా" కండక్టర్ అరుపుకి ఉలిక్కిపడి వెనక్కి జరిగింది కీర్వాణి. వెనక్కి తిరిగి చూడకపోయినా తన వెనకనే నిలబడి ప్రతి రోజూ ఆ బస్‌లో తమ విధి అనుకుంటూ తనని ఏడిపించే యశ్వంత్, అవినాష్, యోగి, బన్ను, మయూర్ ఉన్నారని తెలుసు.

ఏమిటబ్బా ఈరోజు విచిత్రం వీళ్ల గొంతు వినిపించడంలేదు. ఆలోచిస్తున్న కీర్వాణి డ్రైవర్ వేసిన సడన్ బ్రేక్‌కు ఎదరకి పడబోయి నిలద్రొక్కుకొని రాడ్ పట్టుకుంది. ఆమె ఇలా రాడ్ పట్టుకోవడమే [illegible], అలా వెనకనుంచి గట్టిగా ఈల వినిపించడం ఏమిటి ఒకేసారి జరిగాయి.

"రేయ్ అవినాష్! ఎందుకురా అలా ఈలవేశావు?!" బన్నుగాడి సన్నాయి నొక్కు.

"వాడికీమధ్య క్రొత్తక్రొత్త అందాల మీద మోజు ఎక్కువైందిరా" మయూర్ ఉవాచ.

"ఛ... ఛ నోరుముయ్యండిరా. వాడు దేనికి వేశాడో కనుక్కోకుండా" యశ్వంత్ కసురు.

"రేయ్ నాన్న అని, అవినాష్ ఎందుకురా కన్నా విజిల్ వేశావు?" యోగి బతిమాలటం అవినాష్‌ని హీరోని చేసి నిలబెట్టాయి. ఫ్రెండ్స్‌ని ఊరిస్తున్నట్టు చూస్తూ.

"రేయ్ మొద్దుముఖాల్లారా! సండే ఈజ్ లాంగర్ దాన్ మండే" కీర్వాణి బ్లౌజను దాటుకొని వచ్చిన బ్రాని చూస్తూ ఏదో సత్యాన్ని కనుక్కొన్నట్లు ఫోజుపెడుతూ అన్నాడు అవినాష్.

"వాట్" మయూర్ ఆశ్చర్యం.

"కౌన్" యశ్వంత్ ఉత్సుకత.

"ఒరే పిచ్చివాగన్నా! ఓ దేఖో నీల్ పాడివాలీ" అవినాష్ విశదీకరణ.

"ఒరేయ్ నీకు భలే కనిపిస్తాయిరా! అయినా నీ చూపు అక్కడికి పోయిందేమిటి?" అన్నాడు బన్ను అమితోత్సాహంతో.

"నేను చూడాలని చూడలేదురా... కానీ" అని అవినాష్ మాట మధ్యలో అందుకొని,

"అక్కడ పడింది" అని యోగి పూర్తిచేశాడు.

కీర్వాణికి అర్థమైపోయింది. ఆ అనేది తననే అని. రోజూ మామూలుగా వుండే ఏడ్పింపు ఈ రోజు పరాకాష్టకు చేరుకుందని.

చదువు నేర్పిన సంస్కారం కళ్లల్లోంచి ఉబికిరాబోతున్న నీరు అదిమిపెట్టింది. కాని వాళ్ల మాటలకి తూట్లుపడ్డ మనసు మాత్రం గోలపెడుతూనే ఉంది. వాళ్లకి బుద్ధి చెప్పమంటూనే ఉంది.

వాళ్ళు వాడిన మాట తనకి అర్థమైనట్లు తెలిస్తే వాళ్ల వాగుడు ఇంకా ఎక్కువవుతుందని ఝడిసి, ఆ పదానికి అర్థం తెలియనట్లే ఊరుకుంది. తను చేరవలసిన గమ్యం వరకు తన మనసు నొక్కిపట్టే ఉంచింది.

ఇక ఈ బస్‌లోకి వచ్చినా ఎక్కకూడదు అనుకున్న 24 గంటలు పూర్తికాలేదు. ఆ బస్ తప్ప వేరే దిక్కులేక ఆ బస్సు ఎక్కని పరిస్థితి తప్పలేదు.

భయపడుతూ, భయపడుతూ వెనక్కి జరిగిన కీర్వాణికి యోగి, బన్ను, యశ్వంత్, మయూర్ ఇంకో అమ్మాయిని ఏడిపించడం కళ్ళబడింది.

వీళ్ళ హీరో అవినాష్ ఎక్కడ. ఆమెకళ్ళు వెతికాయి. మహానుభావుడు. వీళ్ల నలుగురికి అతను తోడైతే ఈ కోతిమూక బస్‌ను బస్‌లా ఉంచరు.

వీళ్ళని ఎదిరిస్తే ఎవరు లేనిచోటు చూసి తంతారేమో అనే భయంతో డ్రైవర్, కండక్టర్ వీళ్ళ వాగుడిని పట్టించుకోరు.

వాళ్ళ నలుగురి మధ్య నిస్సహాయంగా నిలబడిన ఆ అమ్మాయిని చూస్తుంటే కీర్వాణికి జాలివేసింది. ప్రక్కవాడి ఇల్లు తగలబడిపోతున్నా పట్టించుకోని సమాజం మనది.

"ఇటు రండి" తను ప్రక్కకు జరిగి ఆమెకు స్థలం ఇచ్చింది.

"థాంక్సండి" కీర్వాణి ప్రక్కకు వస్తూనే అందా అమ్మాయి.

"రేయ్! మన హీరోయిన్‌కి ఈరోజు ధైర్యమెక్కువైపోయిందిరా" బన్ను గట్టిగా అరిచాడు.

"మీ పేరు" అడిగింది కీర్వాణి.

"ప్రతిమ" ఆమె సమాధానం.

"ఈ కాలనీకి క్రొత్తగా వచ్చారా?"

"అదేంకాదండి. హాలిడేస్ కదా అని మా పెద్దమ్మ దగ్గరికి వచ్చాను. మా పెద్దమ్మగారి అమ్మాయి వాళ్ళ ఫ్రెండింటికి వెళదామంటే బయలుదేరాను".

"మరి ఆమె మీతో రాలేదా?" అడిగింది కీర్వాణి.

"వచ్చింది. అదిగో ఆ ముందున్నమ్మాయే".

"అరే ఆమె అవినాష్ చెల్లెలు కదు" అడిగింది కీర్వాణి.

"అవును అవినాష్ మా అన్నయ్యే. మా అన్నయ్య మీకు తెలుసా?"

"ఎందుకు తెలీదు. వెధవ బస్‌లో అడ్డమైన జోక్స్ వేస్తాడుగా" కసిగా అందామనుకుంది. కాని అవినాష్ చెల్లెలైనంత మాత్రాన ఈమేం చేసింది. ఈమె కూడా తనలాంటి అమ్మాయేగా అనుకుంది.

తన చెల్లెల్ని తన డియర్ ఫ్రెండ్సే కామెంట్ చేసారని తెలిస్తే అవినాష్‌గాడి ముఖం ఎలా ఉంటుంది. బహుశా అప్పడంలా మాడిపోతుందేమో.

"రేయ్ బన్ను! మన సుజుకీ ఫ్లోరెన్స్‌తో ఏమిటర్రా తెగ కబుర్లు చెబుతుంది" మయూర్ అరిచిన అరుపుకి ఉలిక్కిపడింది కీర్వాణి. వాళ్ళు తనకి సుజుకీ అని పేరు పెట్టారని తెలుసు. అలా ఎందుకు పెట్టారో తల బద్దలు కొట్టుకొని ఆలోచించినా తనకింతవరకు అర్థంకాలేదు.

ఫ్లోరెన్స్ అనేది ఈ కొత్తమ్మాయి ప్రతిమకి ఇప్పుడే పెట్టిన పేరనుకుంటా.

"ఏముందిరా మన సుజుకీ ఫ్లోరెన్స్‌కి ఏం చెబుతుంది. తన పెండర్స్ గురించి తప్పితే. అంతకంటే విశేషం ఏముంటుంది?" యోగి అన్నాడు.

"ఒరేయ్! నేను చిన్న సుజుకీ హోండా ఎక్కితే చూశామురా" యశ్వంత్ అన్నాడు.

"బాప్‌రే! సుజుకీ హోండా మీదకా? అదేమిటిరా? చచ్చాడా? బ్రతికాడా?" మయూర్ నవ్వుగా అన్నాడు.

వాళ్ల మాటలు వింటుంటే అక్కడే తనకి గుండె ఆగిపోతే ఎంత బాగుండును అనిపిస్తోంది కీర్వాణికి. కళ్ళల్లో గిర్రున నీళ్లు తిరిగాయి.

"పోరా! నువ్వు చిన్న హోండా చూశావా? నేను ఇంతకుముందు ఎల్.ఎమ్.ఎల్ చూశానే" యోగి అన్నాడు.

వీళ్ళెందుకిలా ఉంటారు? ఎందుకిలా అమ్మాయిల్ని కామెంట్ చేస్తారు. వాళ్ళు చేసే కామెంట్స్‌కి, వేసే అడ్డమైన జోక్స్‌కి వాళ్ళెంత బాధపడతారు అన్న జ్ఞానం ఉండదా? ఇదంతా వాళ్ళ తల్లిదండ్రుల పెంపకం లోపమా? లేక స్త్రీని గౌరవించడం వీళ్ల కి నేర్పని గురువులదా?

అదీ కానివాడు వీళ్ళకి అక్కచెల్లెళ్లు లేరా? లేకపోవడం ఏమిటి? వీళ్ళకి ఒక్కొక్కళ్లకి ఇద్దరో, ముగ్గురో అక్కచెల్లెళ్ళు ఉన్నారు కదా! ప్రతీ అమ్మాయిని కామెంట్ చేసే ముందు వాళ్ళకి వాళ్ళ చెల్లి ముఖమో, అక్క ముఖమో గుర్తురాదా? ఆలోచించే కొద్దీ వీళ్ళ మనస్తత్వానికి మతిపోతోంది కీర్వాణికి.

"ఒరేయ్ మయూర్! మనం రోజుకో షర్ట్ మార్చినట్లు ఈ సుజుకీ రోజుకో క్రొత్త వెహికల్ మారుస్తుందిరా" యశ్వంత్ వెటకారంగా అన్నాడు.

## చైతన్యనంది


అంతసేపు వాళ్ళ వాగుడు వింటున్న కీర్వాణికి సహనం చచ్చిపోయింది. అంతే గిర్రున వెనక్కి తిరిగి, ఏం జరుగుతుందో ఊహించే అస్కారం కూడా ఇవ్వకుండా మయూర్, యోగి, బన్ను, యశ్వంత్‌ల చెంపలు అదరగొట్టేసింది.

ఆ సంస్కారం లేనివాళ్ళకి ఎప్పటికన్నా అర్థమవుతుందా? కీర్వాణి ఎక్కిన ఆ హోండా ఆమె పెద్దన్నది అని, ఆ ఎల్.ఎమ్.ఎల్ చిన్నన్నదని.

### గమనిక

18–8–89 సంచికలో ప్రచురించిన 'నీలిమబ్బులలో నా నేస్తం' కథా రచయిత్రిల పేరు ప్రచురించలేదు. పేర్లు 'మహిజానంది' 'చైతన్యనంది'. ఎడిటర్

## నగరం కాచిన వెన్నెల



అర్థరాత్రి—
జీవితం మీంచి నడిచి వచ్చిన పీడకల
మబ్బులా నిద్రను తేలుస్తుంది
కబుర్లతో నింపేసిన కాలం
ఖాళీ సీసాలా వెక్కిరిస్తుంది.
ఉలిక్కిపడి కిటికీ తెరిస్తే
ఎదురింటి కొబ్బరి ఆకుల మీంచి
వెన్నెల జాలిగా పలకరిస్తుంది
ఇదొక మహానగరం!
ఇక్కడ
గదికీ మదికీ ఎప్పుడో గడియలు వేసేశాం
జెట్లతో గుడ్‌నైట్లతో తెల్లారుస్తాం
అందుకేనేమో పాపం పిచ్చివెన్నెల
అనాధలా బిక్కు బిక్కు మంటూ
బిక్క చచ్చిపోయి తిరుగుతూంటుంది.
వెన్నెలా! వెండి వెన్నెలా!
అప్పుడెప్పుడో నువ్వు అందలాలెక్కి
ఉండొచ్చు
వరి కంకులపై వయ్యారంగా ఊగుతూ
మల్లెలతో ముచ్చట్లాడి ఉండొచ్చు
ఆయనెవరో మహాకవి పాపం
అమృతం కురిసిన రాత్రి అంటూ
నిన్ను దోసిళ్ళతో తాగి ఉండొచ్చు
కానీ—
ఇక్కడ మాత్రం
నువ్వు
నగరం కాచిన వెన్నెలవి!

—జి.లక్ష్మి